సాక్షి గుంటూరు

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం 2024 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.



మల్లెతోటలు పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని హౌస్‌గణేష్ గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పరిశోధనాస్థానం గుంటూరు లాంఫాం శాస్త్రవేత్తలు మల్లెతోటలు పరిశీలించారు.



బియ్యం పంపిణీ తనిఖీ

తెనాలి: జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ గురువారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్ల వాహనాలను తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

బీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి

టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఘన చరిత్ర కలిగిన బీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తున్నామని టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్‌తో కలిసి ప్రద్యుమ్న స్టేడియంను పరిశీలించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రికెట్ స్టేడియం, బౌండరీ వాల్‌తోపాటు 400 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టేడియం అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతోపాటు బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి ప్రద్యుమ్నను కోరారు.

రేపు మినీ జాబ్ మేళా

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం గుంటూరు కలెక్టరేట్ రోడ్డులో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాల జిల్లా కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి కె.రఘు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిసర ప్రాంతాలలో ఉన్న యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. జాబ్‌మేళాలలో ఎల్ఐసీ, పేటీఎం సంస్థలు ప్రత్యేకంగా హాజరవుతాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 19–35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు వారి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌ఫోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9652065235 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 1,24,034 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,24,034 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,20,528 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,912 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

61.42 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మొదలైంది. గురువారం రాత్రి 6.25 గంటలకు 61.42శాతం పూర్తయినట్లు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 2,84,006 మందికి రూ.84.82కోట్లు పంపిణీ చేయాల్సివుండగా 1,74,384మందికి రూ.52.09కోట్ల పంపిణీ చేశారు. తెల్లవారు జాము నుంచే సచివాలయ సంక్షేమ సెక్రటరీలు, ఆయా ప్రాంతాల వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి సామాజిక భద్రతా పింఛన్లు అందజేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,510, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 821.90 అడుగుల వద్ద ఉంది.

రైతు సేవల నిలయాలు

అన్నదాతల నేస్తాలు.. రైతుభరోసా కేంద్రాలు

- ఆర్‌బీకేలతో గ్రామ స్థాయిలోనే రైతులకు అన్ని రకాల సేవలు
- విత్తు నుంచి విక్రయం వరకూ లభ్యం
- వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు
- మూడేళ్లలోనే అద్భుత ఫలితాలు



ఫిరంగిపురం ఆర్బీకేలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ నున్నా వెంకటేశ్వర్లు (ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): సబ్సిడీ విత్తనాలు.. రసాయన ఎరువులు.. రాయితీ పరికరాలు, పంట పరిహారం మంజూరు కోసం గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం లభించేది కాదు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగలేక రైతులు ఈ అవస్థలు ఇంకెన్నాళ్లు అంటూ పెదవి విరిచేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి కష్టాలన్నీ తీరాయి. గ్రామస్థాయిలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన సేవలన్నీ అందుతున్నాయి. అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తూ రైతు భరోసా కేంద్రాలు సేవల నిలయాలుగా నిలిచాయి.

జిల్లాలో 249 ఆర్బీకేలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇవి 2020 మే నెల 30వ తేదీన ప్రారంభమయ్యాయి. వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, పశు సంవర్ధక, మత్స్య, పట్టుపరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందిస్తున్నాయి. దీంతో అన్నదాతలకు సమయం, డబ్బులు ఆదా కావడంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లే శ్రమ తప్పింది. గుంటూరు జిల్లాలో 249 ఆర్‌బీకేలు రైతులకు సేవలు అందిస్తున్నాయి. అందులో 11 ఆర్‌బీకేలు అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయి.

అందుబాటులో అన్ని సేవలు...

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్.. అంటే విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు ఆర్‌బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన దాదాపు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పాటయ్యాయి. ఆర్‌బీకేల్లోనే రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణ ఇస్తారు. ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. డిజిటల్ కియోస్కల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే చాలు.. రైతు ఇంటి ముంగిటకు వచ్చేస్తున్నాయి.

గతంలో ఇలా...

టీడీపీ హయాంలో సబ్సిడీపై పంపిణీ చేసే అరకొర విత్తనాల కోసం మండల, నియోజక వర్గాల కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాసే వాళ్లు. బస్తా ఎరువు అవసరమొచ్చినా పరుగెత్తాల్సి వచ్చేది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కార్యాలయాలు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కరుణ ఉండేది కాదు. పంటను మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఎన్నో ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చేది.

అక్రమాలకు చెక్...

గతంలో ప్రైవేటు డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించే వారు. ఎమ్మార్పీపై అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్బీకేలు ఏర్పాటు అయిన తర్వాత ప్రైవేటు డీలర్ల అక్రమాలకు చెక్ పడింది. 2021–22లో గుంటూరు జిల్లాలో 22,017 మెట్రిక్ టన్నుల ఎరువులు, 2022–23లో 20 వేల మెట్రిక్ టన్నులు, 2023–24లో ఇప్పటివరకు 13,465 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు నిర్దిష్టమైన ధరలకే అందజేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర వాటి కోసం ఆర్‌బీకేల్లోని డిజిటల్ కియోస్కల ద్వారా బుక్ చేసుకుంటే చాలు.. సేవలు అందినట్లే. ఈ సారి ప్రభుత్వం నానో డీఏపీ, యూరియాలను కూడా అందుబాటులోకి తెచ్చింది.

సలహా మండళ్లు.. ఎన్నో మేళ్లు..

ఆర్‌బీకే స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్‌బీకే స్థాయి, రెండో శుక్రవారం మండల స్థాయి, మూడో శుక్రవారం జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్ల సమావేశాలు నిర్వహిస్తారు. రైతులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి వాటిని మండల స్థాయిలో జరిగే సమావేశానికి అజెండాగా పెడతారు. మండల స్థాయిలో జరిగే సమావేశంలో వీటికి పరిష్కారాలను కనుగొంటారు. మండల స్థాయిలో పరిష్కారం కాని వాటిని జిల్లా స్థాయిలో జరిగే సమావేశంలో అజెండాగా పెడుతూ సమస్యలను పరిష్కరిస్తుండటం విశేషం.

సీఎంకు రుణపడి ఉంటాం...



ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆర్‌బీకే ద్వారా 50 కిలోల మినుము విత్తనాలు పొందాం. ఆర్‌బీకేలు వచ్చిన తర్వాత మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. వ్యవసాయ సలహాలు, సూచనలు కూడా ఆర్‌బీకేల్లో ఇస్తున్నారు. ఆర్‌బీకే స్థాయిలో పంటలు నమోదు చేసుకున్నాం. అన్ని రకాల సేవలు ఊర్లోనే అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–వంగా నవీన్‌రెడ్డి, గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామం

అన్ని రకాల సేవలు అందిస్తున్నాం...



రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిట్లోనే అందించే ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. సబ్సిడీతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలను కూడా అందిస్తున్నాం. కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. పంటల నమోదు పకడ్బందీగా జరిగే ఏర్పాటు చేశాం. ఉపాధి హామీ పథకం నిధులతో ఆర్‌బీకేలకు సొంత భవనాలు నిర్మిస్తున్నాం.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- గుంటూరు అర్బన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం కల్పిస్తాం
- రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు
- జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ డూడీ



బాధ్యతలు స్వీకరిస్తున్న తుషార్ డూడీ

నగరంపాలెం: జిల్లాలో మహిళల భద్రత, రక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తానని గుంటూరు జిల్లా నూతన ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ (ఎస్‌డబ్ల్యూ) ఎస్పీగా బదిలీపై వెళ్తున్న కె.ఆరిఫ్ హఫీజ్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని ఎస్పీ చాంబర్‌లో గురువారం గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా తుషార్ డూడీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత డీపీఓ ఆవరణలోని వీరభద్ర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. చాంబర్ ఎదుట పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుషార్ డూడీ మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని చెప్పారు. జిల్లాపరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధునాతనమైన పద్ధతులు, తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తామని, రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తామని పేర్కొన్నారు. ఇక గుంటూరు అర్బన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం సృష్టిస్తామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. విధులను చాలెంజ్‌గా తీసుకుని నిర్వహిస్తామని తెలిపారు. ఎప్పటిలాగానే ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కొనసాగుతుందని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జిల్లా ఎస్పీ బదులిచ్చారు. అనంతరం శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, జిల్లా ఏఎస్పీలు శ్రీనివాసరావు (క్రైం), ఎం.వెంకటేశ్వరరావు (సెబ్), కె.కోటేశ్వరరావు (ఏఆర్), పలువురు డీఎస్పీలు, సీఐలు నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

- ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వైఎస్సార్ జిల్లా ఏఎస్పీ (పరిపాలన)గా విధులు నిర్వహిస్తోన్న తుషార్ డూడీ జిల్లా ఎస్పీగా ఉద్యోగోన్నతిపై వచ్చారు. తొలి పోస్టింగ్‌గా గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులైన విషయం విధితమే.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ‘ఆసరా’

- మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో మంత్రి విడదల రజిని
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి

పట్నంబజారు: దేశ రాజకీయాల్లో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా రూ. 2లక్షల 50వేల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని పేర్కొన్నారు. గురువారం నగరంపాలెంలో స్టాల్స్ బాలికల పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని స్పష్టం చేశారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల్లో 90 శాతం పథకాలు మహిళలకు సంబంధించినవేనని తెలిపారు. అక్కచెల్లెమ్మలను గత ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు మోసం చేస్తే.. సీఎం వైఎస్ జగన్ వారిని అన్ని విధాలుగా అక్కున చేర్చుకున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో నిలదొక్కుకోవటంతో పాటు, ఆర్థిక స్వావలంబన దిశగా వారిని ముందుకు తీసుకుని వెళ్లారన్నారు. అమ్మ ఒడి, పేదలందరికి ఇళ్లు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపునేస్తం వంటి మరెన్నో పథకాలను ప్రజలకు చేరువ చేయటంతో పాటు, విద్య, వైద్యాన్ని ప్రతి గడపకు చేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందుకు అక్కచెల్లెమ్మలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను మోసం చేసిన సిగ్గులేని వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వలస పక్షిని తలపించేలా షర్మిల వ్యవహరిస్తున్నారన్నారు.

‘మీ రజినమ్మని నేను..’

మీ రజినమ్మని నేను...మీ తరఫున పోటీ చేయబోతున్నానని మంత్రి రజిని పేర్కొన్నారు. మీ ఇంటి బిడ్డలా.. అక్కలా.. చెల్లిలా.. ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్లు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

వైభవంగా తిరుపతమ్మ రంగుల మహోత్సవం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి రంగుల మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. రెండేళ్లకొకసారి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5.54 గంటలకు వేద పండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య మహా నివేదన అనంతరం శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వాముల ఉత్సవమూర్తులు సహదేవతలు మల్లమ్మ, చంద్రయ్యలు, శ్రీఅంకమ్మ, పెద్దమ్మలు, మద్దిరావమ్మ, వున్నవూరు అంకమ్మ, గుర్రం వాహనాలను ఆలయం నుంచి ఈవో కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సతీమణి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో సాయిహర్ష, , పాలకవర్గ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆలయం నుంచి వెలుపలకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు విగ్రహాలు రంగుల మండపం వద్దకు చేరుకున్నాయి.



ఉత్సవానికి బయలుదేరిన విగ్రహాల వద్ద ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు

కోలాహలంగా క్రీడా పండగ

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు

గుంటూరు వెస్ట్: రాష్ట్రంలో క్రీడా సంబరాలు పండగ వాతావరణంలో జరుగుతున్నాయని, దీంట్లో గ్రామస్థాయి నుంచి ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ పోటీలకు వన్నె తెస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి క్రీడా పోటీలను కలెక్టర్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరి రావు, విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.46 లక్షల మంది క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. ఇప్పటికే గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు ముగిశాయన్నారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా నగదు బహుమతులు కూడా ప్రదానం చేశామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి క్రీడాపోటీల్లో పాల్గొనడంవల్ల ఆరోగ్యంతోపాటు, మానసిక ఉల్లాసం, స్నేహభావ వాతావరణం ఏర్పడతాయని చెప్పారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలనే..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతోపాటు ఆరోగ్యంగా జీవించాలనే మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిసెంబర్ 26న గుంటూరులోనే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందని చెప్పారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందజేయడంతోపాటు బెలూన్లు ఎగుర వేశారు. డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం

- రూ.225 కోట్లతో ఆధునికీకరణ
- ఈ ఏడాది జూన్‌లోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- విలేకరుల సమావేశంలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



మాట్లాడుతున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంజూరు చేసిన అమృత్ భారత్ స్టేషన్‌లను అత్యాధునికరణ పద్ధతిలో రూపొందేందుకు సిద్ధం అవుతున్నాయని గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలో డీఆర్‌ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కేంద్ర రైల్వే బడ్జెట్‌పై సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్‌లుగా సిద్ధం చేసేందుకు కేంద్ర రైల్వేశాఖ ఆమోదం తెలిపిందన్నారు. గుంటూరు, రేపల్లె, నంద్యాల, మంగళగిరి, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, నడికుడి జంక్షన్, వినుకొండ, ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ, మాచర్ల, దొనకొండ స్టేషన్‌ల అభివృద్ధికి రూ.225 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది జూన్‌లోగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ 16 స్టేషన్‌లలో ప్రధానంగా ఏడు రైల్వే స్టేషన్‌లలో ఎఫ్‌ఓబీ (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్)లు నిర్మాణం చేయనున్నామన్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం ఫుడ్ ప్లాజాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని స్టేషన్‌లకు మాస్టర్ ప్లాన్‌లను పూర్తి చేశామన్నారు. ఈ స్టేషన్‌లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు నూతన ఆధునిక పద్ధతిలో సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర రైల్వే శాఖ గుంటూరు డివిజన్‌లో మంజూరు చేసిన అమృత్ భారత్ స్టేషన్ పనులను పూర్తి చేయడంతోపాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్ పేరు ప్రథమ స్థానంలో ఉండేలా చేసేందుకు డివిజన్ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఏడీఆర్‌ఎంలు శ్రీనివాస్, సైమన్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

2024 కేంద్ర బడ్జెట్ వాయిస్

యువతకు ప్రోత్సాహం



గుంటూరు మెడికల్: మోదీ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ద్వారా దేశ ప్రజలకు ముఖ్యంగా రైతులు, మహిళలు, యువతకు ప్రోత్సాహకాలు లభించి, స్వయం సహాయకంగా అభివృద్ధి చెందుతారు. 2047 నాటికి భారతదేశం ఆర్థికంగా ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉండే విధంగా ప్రణాళికను రూపొందించడం జరిగింది. బడ్జెట్లో గ్రామీణ ఉపాధికి రూ.86 వేల కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.125 లక్షల కోట్లు ప్రకటించడం ద్వారా వ్యవసాయానికి రైతులకు మేలు చేసే బడ్జెట్ అని చెప్పడంలో సందేహం లేదు. ఆయుష్మాన్ భారత్ పథకానికి రూ. 7500 కోట్లు ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాబడ్జెట్ అని చెప్పవచ్చు. ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

– వి.పాండురంగ విఠల్ ,ఉపాధ్యక్షుడు బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా

మధ్యతరగతికి ప్రయోజనం



నగరంపాలెం: కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉంది. రెండు కోట్ల మందికి పీఎం అవాస్ యోజన పథకం కింద సొంత ఇంటి కలను సాకారం చేయడం, రూఫ్ టాప్ సోలార్ పాలసీతో కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్, పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక సమగ్ర కార్యక్రమం, అన్నదాతలకు సబ్సిడీ ఎరువులు తదితర ప్రకటనలు అందుకు నిదర్శనం.. ఏపీలో అన్నదాతలకు రైతు భరోసా కేంద్రాలు, పేద, మధ్య తరగతి ప్రజలకు జగనన్న కాలనీలు, బలహీన వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర కార్యక్రమాలు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లగా ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిస్తున్న నవరత్నాల పరంపరను ప్రతిబింబిస్తోంది.

– అంబటి మురళీకృష్ణ, ప్రముఖ కార్పొరేట్ బిల్డర్

ఉమ్మడి జిల్లాలో పలువురు
డీఎస్పీలు బదిలీ



గుంటూరు పశ్చిమ ఏసీపీ మహేష్

నగరంపాలెం : ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 102 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. గుంటూరు దిశ ఉమెన్ పీఎస్ డీఎస్పీ కేసన చెంచురామారావుని కొవ్వూరు డీఎస్పీగా, తూర్పుగోదావరి క్రైం డీఎస్పీ జి.సి.గురునాథ్‌బాబుని పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా, రాజమండ్రి ఈజీ/కొవ్వూరు డీఎస్పీ వి.ఎస్.ఎన్.వర్మను పల్నాడు జిల్లా నరసరావుపేటకు, పల్నాడు జిల్లా దిశ ఉమెన్ డీఎస్పీ యు.రవిచంద్రను జగ్గారెడ్డి గూడెంకు, ఒంగోలు పీటీసీ డీఎస్పీ ఎం.సుధాకరరావుని పల్నాడు జిల్లా దిశ ఉమెన్ పీఎస్‌కు, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ వెస్ట్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా, మైలవరం డీఎస్పీ ఎం.రమేష్‌ను గుంటూరు సీసీఎస్‌కు, గుంటూరు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబును మచిలీపట్నం డీఎస్పీగా, తుళ్లూరు డీఎస్పీ వి.పోతురాజును గుంటూరు ఎస్‌బీకి, గుంటూరు పశ్చిమ డీఎస్పీ బి.ఉమమహేశ్వరరెడ్డిని శ్రీకాళహస్తి డీఎస్పీగా, పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను ఈస్ట్ గోదావరి దిశ ఉమెన్ పీఎస్‌కు, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాల సుందరరావుని మార్కాపురం డీఎస్పీగా, గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాష్‌బాబును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ దిశ డీఎస్పీగా, గుంటూరు ఎస్‌బీ తుపాకుల వెంకట రత్నస్వామిని ప్రకాశం దిశ ఉమెన్ డీఎస్పీగా, గుంటూరు ఎస్‌సి/ఎస్‌టి సెల్ డీఎస్పీ ఎస్.విజయ శేఖర్‌ను ఏసీబీ డీఎస్పీగా, పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్‌ను గుంటూరు పశ్చిమ ఏసీపీగా, ప్రకాశం జిల్లా దిశ పీఎస్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల జిల్లా క్రైం డీఎస్పీగా, బాపట్ల జిల్లా క్రైం డీఎస్పీ కె.నాగేశ్వరరావును ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

నలుగురు సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: రేంజ్‌లో నలుగురు సీఐలకు డిప్యూటీ సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఉద్యోగోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సీఐల ఉద్యోగోన్నతుల్లో నలుగురు గుంటూరు రేంజ్ పరిధిలో విధులు నిర్వర్తించే సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు. సీఐ కె.శ్రీనివాసాచారిని తిరుమల డీఎస్పీగా, సీహెచ్.వి.బి.సుబ్రమణ్యం, బి.ప్రసాద్‌ను ఇంటిలిజెన్స్ డీఎస్పీగా, షేక్.బాజిజాన్‌సైదాను పెనుకొండ డీఎస్పీగా బదిలీయ్యారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- చిరుమామిళ్లలో రూ.6 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ



చిరుమామిళ్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో మల్లెల

నాదెండ్ల: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, అనారోగ్యంతో ఏ ఒక్క కుటుంబం అప్పులపాలు కాకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందజేస్తోందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ల గ్రామంలో దాత నడికట్టు రామిరెడ్డి అందించిన 2.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.6కోట్ల నాబార్డు నిధులతో 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. సభకు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు అధ్యక్షత వహించారు. తొలుత పార్టీ చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడుతో కలిసి గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదు రుగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొడ్డా బాలకోటిరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో పంచాయతీరాజ్‌శాఖ నిధులతో ఏర్పాటు చేసిన రచ్చబండను ప్రారంభించా రు. అనంతరం ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

రూ.17వేల కోట్లతో ఆస్పత్రుల ఆధునికీకరణ..

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణంతో చుట్టుపక్కల గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా రూ.17 వేల కోట్ల నిధులను ఆసుపత్రుల ఆధునికీకరణకు ఖర్చు చేసిందన్నారు. చిలకలూరిపేటలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, రూ.8500 కోట్లతో నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపథకం ద్వారా గ్రామాల్లోనే మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు అందించి అవసరమైన వారికి ఏరియా ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించేందుకు అవకాశం కలిగిందన్నారు. గ్రామంలో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. పార్టీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వాసుపత్రుల ద్వారా పేదలకు నాణ్యమైన మెరుగైన ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత, ఉప సర్పంచ్ మేకల హనుమాయమ్మ, ఎంపీటీసీ సునీత, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, ఏడుకొండలు, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ అహమ్మద్, నాదెండ్ల సొసైటీ సీఈఓ అంజయ్య, వైద్యఆరోగ్య శాఖ ఎస్ఈ వి.చిట్టిబాబు, డీసీహెచ్ఎస్ రంగారావు, ఈఈ శ్రీధర్‌ప్రసాద్, డీఈ హనుమంతరావునాయక్, ఏఈ ధనుంజయరావు, పార్టీ నాయకులు అల్లడి రవికుమార్, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, సింగారెడ్డి కోటిరెడ్డి, గద్దె కోటేశ్వరరావు, జెట్టి లక్ష్మీనారాయణ, కోయలమూడి సాంబశివరావు, కాట్రగడ్డ రామకృష్ణ, బత్తుల సీతారామిరెడ్డి, చందవరం వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలీ ఉన్నారు.

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌కు ఘన వీడ్కోలు

జిల్లాలో నాలుగేళ్లు సమర్థవంతంగా విధులు నిర్వహణ



ఎస్పీని జీపులో తీసుకువెళ్తున్న పోలీసు సిబ్బంది

నగరంపాలెం: ఇంటిలిజెన్స్ (ఐఎస్‌డబ్ల్యూ) ఎస్పీగా బదిలీపై వెళ్లిన కె.ఆరిఫ్ హఫీజ్‌కు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆయనను ఓపెన్‌లెస్ టాప్ జీప్‌పై ఎక్కించి, తాళ్లతో జీపును లాక్కెళ్లారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అరిఫ్ హఫీజ్‌ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. డీపీఓలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తొలిసారి గుంటూరు జిల్లాకు ఎస్ఈబీ (సెబ్) ఏఎస్పీగా విధుల్లో చేరానని చెప్పారు. అనంతరం గుంటూరు అర్బన్, జిల్లాల పునర్విభజన తర్వాత గుంటూరు జిల్లాకు ఎస్పీగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. నాలుగేళ్లల్లో జిల్లా ఎస్పీగా సమర్థవంతంగా విధులు చేపట్టినట్లు పేర్కొన్నారు. శిక్షణ ఐపీఎస్ మనోజ్ హెగ్డే, ఏఎస్పీలు శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.సుప్రజ (పరిపాలన), ఎం.వెంకటేశ్వర రావు (సెబ్), కె.కోటేశ్వర రావు (ఏఆర్), పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పలువురు పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొని, వీడ్కోలు పలికారు.

సత్తాచాటిన జార్ఖండ్ మహిళా క్రికెట్ టీం

హైదరాబాద్‌పై ఘన విజయం



69 పరుగులతో రాణించిన యాంక లూథ్రా



మూడు వికెట్లు తీసిన జాస్మిన్



మూడు వికెట్లు తీసిన రాథోర్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోగల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న బీసీసీఐ అండర్ 23 ఉమెన్ టోర్నమెంట్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై జార్ఖండ్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన జార్ఖండ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్ జట్టు 45.03 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. జార్ఖండ్ బౌలర్ పి.రాథోర్ మూడు వికెట్లు తీసింది. అనంతరం 140 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 41.03 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి విజయం సాధించింది. జార్ఖండ్ బ్యాట్స్ ఉమెన్ ప్రియాంక లూథ్రా 69 పరుగులతో రాణించింది. హైదరాబాద్ బౌలర్ జాస్మిన్ గిల్ 3 వికెట్లు తీసింది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పేట విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ జట్టుకు కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థి పి.నరేంద్ర ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. వి.నాగిరెడ్డి గురువారం తెలిపారు. ఖాజీపాలెంలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ 10కే, 20కే పోటీలలో నరేంద్ర 10కే పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి పతకం సాధించి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. మహారాష్ట్రలో త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. నరేంద్రను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వెంకటశివ, పీడీ ఎం.వినీల్ అభినందించారని తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట రూరల్: ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను గత నెల 30, 31 తేదీలలో వర్సిటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జట్టులోని క్రీడాకారులు గొట్టం లక్ష్మీ స్నేహలత, బొజ్జ యమున, దనిరెడ్డి రాణిలు ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. వీరిని కళాశాల చైర్మన్ శేషగిరిరావు, ప్రిన్సిపల్ ఎం.ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ జాజుల శంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఆరుగురు నిందితులకు రిమాండ్

మార్టూరు: విధి నిర్వహణలో అధికారులను అడ్డుకుని వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసిన ఎనిమిది మందిలో ఆరుగురు నిందితులకు అద్దంకి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. బందోబస్తు మధ్య బుధవారం ఉదయం నిందితులను అద్దంకి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. అర్ధరాత్రి 1:00 గంట ప్రాంతంలో కేసును పరిశీలించిన జడ్జి వారికి 14 రోజుల పాటు రిమాండు విధించగా, ఒంగోలు జైలుకు తరలించినట్లు తెలిపారు. గత మంగళవారం మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీ నిమిత్తం వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులను టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆయన అనుచరులు అడ్డుకుని కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే.

కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో

డ్రైవర్ మృతి, ముగ్గురికి గాయాలు



డ్రైవర్ పల్లపాటి కోటేశ్వరరావు



కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో

తాడికొండ: ఆటో అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో డ్రైవరు మరణించడంతో పాటు ముగ్గురు ప్రయాణీకులకు గాయాలైన ఘటన తాడికొండ శివారు పంట పొలాల వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం కంతేరు నుంచి ప్రయాణీకులతో తాడికొండ అడ్డరోడ్డు వద్దకు వస్తున్న ఆటో తాడికొండ శివారు ప్రాంతానికి చేరుకోగానే అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు ప్రయాణీకులకు గాయాలు కావడంతో వారిని 108లో ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

ముగిసిన బేస్‌బాల్ టోర్నమెంట్ పోటీలు



ప్రథమ స్థానం విజేత సీఆర్ కాలేజ్ జట్టుతో కళాశాల యజమాన్యం

గుంటూరు రూరల్: జాతీయ స్థాయి బేస్‌బాల్ జట్టులో స్థానం పొందడమే లక్ష్యంగా ప్రతి క్రీడాకారుడు కృషి చేయాలని ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బేస్‌బాల్ మెన్ టోర్నమెంట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, క్రీడల్లో నైపుణ్య సాధన దిశగా క్రీడాకారులు కృషి చేయాలన్నారు. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిలకలూరిపేట సీఆర్ కాలేజీ జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఆర్వీఆర్ జేసీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, ఎంఎల్ఎస్ డిగ్రీ కాలేజ్ జట్టు తృతీయ స్థానం, ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు నాల్గో స్థానం సాధించాయి. విజేతలకు అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, యూనివర్సిటీ అబ్జర్వర్లు డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ బుజ్జిబాబు, డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు కేటాయించాలి

తాడేపల్లిరూరల్: పట్టణంలో గత 80 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న సుమారు 600 కుటుంబాలకు ఇక్కడే పట్టాలు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. గురువారం తాడేపల్లి రైల్వే స్థలాల్లో ఇళ్ల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి రైల్వే స్థలాల్లో ఇళ్లు వేసుకుని పేదలు జీవిస్తున్నారని ఈ స్థలం రైల్వే వారికి ఉపయోగపడేది ఏమీ లేదని, గత 80 సంవత్సరాలుగా పనికిరాని స్థలం ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లా సూర్యారావు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకర రావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, స్థానిక కార్యదర్శి కోటా బాబూరావు పాల్గొన్నారు.

పిజ్జా వరల్డ్‌కు విద్యుదాఘాతం



గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైడోమినోస్ పిజ్జా వరల్డ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ రాంబాబు కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం డోమినోస్ పిజ్జా వరల్డ్ లో విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది, వినియోగదారులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు, సిబ్బంది ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. హోటల్ మేనేజర్ రావుల హరినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్తక వ్యాపారులకు లైసెన్సు తప్పనిసరి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 కింద ప్రతి ఒక్క దుకాణ, సంస్థ వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని గుంటూరు జోన్–3 జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, విజయవాడ కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం వర్తక యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు కూడా లైసెన్సు పొందాల్సి ఉంటుందన్నారు. లైసెన్సు నమోదు ప్రక్రియ ఈనెల 29వ తేదీలోపు పొందాలన్నారు. ప్రతి వర్తక యాజమాన్య సంఘాల వారు ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రి దేవి, సహాయ కార్మిక కమిషనర్ ఎస్.కె.ఎం. సుభాని, సహాయ కార్మిక అధికారులు, జిల్లాలోని వర్తక యాజమాన్య సంఘాల తరుపున చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, ప్రెసిడెంట్ జె.ఎస్.ప్రభాకర్, సెక్రటరీలు ఆర్.వెంకట్రావు, కె.నరసింహారావు, వి.షణ్ముఖ, వాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ అధ్యక్షుడు ఐ.వాసుదేవరావు, పి.ఎస్.ఆర్.గుపాత వైష్ణవి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల గ్రామంలో జనవరి 19వ తేదీన అగ్నిప్రమాదానికి గురైన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆహుతిపై విచారణ జరుగుతోందని, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాంబాబు ఒక ప్రకటనలో తెలియజేశారని, శుభం కోల్డ్ స్టోరేజీ అగ్ని బాధిత పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వర రావు వెల్లడించారు. శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకున్న రైతులు తమ పంట వివరాలను వారం రోజులలోపు దుగ్గిరాల మార్కెట్ కమిటీ కార్యదర్శికి రిజిస్టరు పోస్టు ద్వారా గానీ, స్వయంగా గాని సమర్పించాలని, సంబంధిత కోల్డ్ స్టోరేజీ వారు జారీ చేసిన బాండు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకులోను, బీమా చేసి వాటి నకలు కాపీలు తదితర వివరాలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, రైలుపేట, దుగ్గిరాల. ఫోన్ నెం. 9182361229, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సుల్తాన్ బజార్, చెంచుపేట, తెనాలి, ఫోన్ నెం. 9182361217లను సంప్రదించాలని యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలియజేశారు.

షూటింగ్ బాల్ పోటీల్లో మెరిసిన విద్యార్థినులు

నాదెండ్ల: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ నేషనల్ చాంపియన్ షిప్‌లో ఏపీ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. చీరాలలో జరిగిన పోటీల్లో ఏపీ అండర్–17 బాలికల జట్టులో చిరుమామిళ్ల రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాపట్ల మైథిలి, మైదవోలు అలేఖ్య, దావల క్రాంతి జట్టులో సత్తా చాటారు. ముగ్గురు క్రీడాకారులు గొరిజవోలుకు చెందినవారు కావడం విశేషం. ఆడుదాం ఆంధ్రాలో పోటీల్లో భాగంగా క్రికెట్ ఉమెన్స్ విభాగంలో చిలకలూరిపేట నియోజకవర్గ జట్టు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుంది. నరసరావుపేటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంది.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.



క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీఐపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్లీ, రేహన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాత ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.



● చిరంజీవి

చలో రష్యా

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.



● కమల్‌హాసన్

మహేశ్ సినిమాలో?

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకి? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.



● నాగార్జున

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.


విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ- ''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రాశ్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రాశ్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ- ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.